www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబర్ 2025
5
తూర్పుగోదావరి

రైతులతో మాట్లాడిన మంత్రి లోకేష్

నల్లజర్ల: మండలంలోని గండేపల్లి గ్రామ పరిధిలోని ఎర్ర కాలువ ముంపు ప్రాంత రైతులతో విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చరవాణి ద్వారా మాట్లాడారు. మంగళవారం స్థానిక ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు గండేపల్లి ఎర్ర కాలువ ప్రాంతంలో పర్యటించారు. ఈ నేపథ్యంలోనే మంత్రి లోకేష్ ఎంఎల్ఎకు ఫోన్ చేశారు. దీంతో తాను ఎర్ర కాలువ ప్రాంతంలో ఉన్నట్లు ఎంఎల్ఎ వివరించారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎతో ఉన్న రైతుతో మంత్రి లోకేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ రైతు మాట్లాడుతూ 2018లో కాలువకు గండ్లు పడ్డాయని, నేటికీ ఆ గండ్లకు మరమ్మతులు చేపట్టలేదని వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలను దృష్టిలో పెట్టుకుని గండ్లు పడిన చోట ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు తీసుకోవాలని, తద్వారా పంటలను కాపాడుకోవాలని రైతులకు ఆయన సూచించారు. 10 వేల మందిని పునరావాస కేంద్రాలకి తరలించినట్లు ఎంఎల్ఎ మద్దిపాటి వివరించారు.

అల్లకల్లోలం

మొంథా తుపాను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాను అల్లకల్లోలం చేసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేదిపాలెం తీరాన్ని తాకినప్పటి నుంచి విధ్వంసాన్ని సృష్టిస్తూనే ఉంది. తుపాను ధాటికి భారీ వృక్షాలు సైతం నేలవాలాయి. వందలాది కొబ్బరి చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు విరిగి పడ్డాయి. ఈదురుగాలులు, భారీ వర్షాలకి వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాలేక గ్రామాలు అంధకారం చిక్కుకున్నాయి. రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలడంతో రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రజలు ప్రాణాలు గుప్పిట పట్టుకుని ఈ రోజు దాటితే చాలంటూ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు.

- మొంథా ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- ఈదురుగాలులతో విరుచుకుపడ్డ తుపాను
- నేలవాలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు
- పలు నివాస గృహాలకు నష్టం
- అంధకారంలో ప్రభావిత గ్రామాలు

ఉప్పాడలో మత్స్యకార గ్రామంపైకి ఎగసిపడుతున్న కడలి

ప్రజాశక్తి - కాకినాడ, రాజమండ్రి ప్రతినిధులు, అమలాపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను తీవ్ర రూపంలో మారి తీరంపై విరుచుకుపడింది. దీని ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. ఈదురు గాలులు వీచాయి. ఉప్పాడ, ఓడలరేవు, అంతర్వేదిలో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. ఉప్పాడలో అలల తాకిడికి పెద్దపెద్ద బండరాళ్లు సైతం ఎగిరిపడ్డాయి. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. అలల తాకిడికి యు.కొత్తపల్లి మండలంలో మత్స్యకార గ్రామాలు కోతకు గురయ్యాయి. కోనసీమ జిల్లాలో అన్ని మండలాల్లోనూ తుపాను ప్రభావం కనిపించింది. పలుచోట్ల వృక్షాలు, కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాను అధికారులు ముందు జాగ్రత్త చర్యగా నిలిపేశారు. రాత్రి అంతా

అలల ఉధృతికి ధ్వంసమైన కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్డు

చాలా గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సిబ్బంది వీటిని వెంటనే సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల ఇంకా పొలాలు ముంపులోనే ఉన్నాయి.

పునరావాస కేంద్రాల్లో అరకొరగానే సౌకర్యాలు

తుపాను నేపథ్యంలో కోనసీమ జిల్లాలో 13వేల మందిని 271 పునరావాస కేంద్రాలకు తరలించారు. కొన్ని శిబిరాల్లో విద్యుత్ సౌకర్యం లేక నిర్వాసితులు ఇబ్బందులు పడ్డారు. రావులపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ముగ్గురు బాలింతలు కొవ్వుత్తుల వెలుతురులోనే ఉన్నారు. తాళ్లరేవు, పిఠాపురం, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో భోజనం మినహా మిగిలిన సౌకర్యాలు ఏవి సక్రమంగా లేవని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పడుకునేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవని తెలిపారు.

సురక్షిత ప్రాంతాలకు గర్భిణులు, బాలింతలు

కాకినాడ జిల్లాలో 95 మంది గర్భిణులను, 1,400 మంది బాలింతలను 52 ఆసుపత్రులకు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హాస్టళ్లలో చదువుతున్న 14,499 మంది విద్యార్థులను సురక్షితంగా ఇంటికి పంపారు. 4,573 బోట్లు కొట్టుకుపోకుండా ఉప్పుటేరు, క్రీక్ లలో ఉంచుకోవాలని మత్స్యకారులకు సూచించారు.

ఏలేరుకు పోటెత్తుతున్న వరద

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఏలేరుకు వరద నీరు పోటెత్తింది. ఏలేరు జలాశయం నుంచి దిగుప్రాంతాలకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం సామర్థ్యం 86.56 కాగా ప్రస్తుతం 85.38 అడుగులకు నీరు చేరింది. 21.72 టిఎంసిల నీరు నిల్వ ఉంది.21 టిఎంసిల కంటే అదనంగా వస్తున్న జాలాలను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. తునిలో తాండవ నదికి వరద నీరు పోటెత్తింది.

తాడిచెట్టు కూలి మహిళ మృతి

ప్రజాశక్తి -మామిడికుదురు

మాకనపాలెంలో తాడిచెట్టు విరిగిపడి గూడపల్లి వీరవేణి(56) అనే మహిళ మృతి చెందింది. ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నగరంలో తాడిచెట్టు కూలడంతో మందపాటి ప్రవీణ్(15) గాయపడ్డాడు. ప్రస్తుతం బాలుడు రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మొగలికుదురులో ప్రయాణిస్తున్న కారుపై కొబ్బరి చెట్టు పడింది. ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు.

పంటలకు తీవ్ర నష్టం

రామచంద్రపురంలో నేలకొరిగిన పంట

కోనసీమ జిల్లాలో 11,500 ఎకరాల్లో వరి పంట నీటి మునిగింది. మరో 432 ఎకరాల్లో పంట నేలవాలింది. తూర్పు గోదావరి జిల్లాలలో 15,425 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. మరో 600 ఎకరాల్లో ముంపునకు గురైంది. 1,997 ఎకరాల్లో మినప పంటకు నష్టం వాటిల్లింది. కాకినాడ జిల్లాలో 3,128 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కోనసీమ జిల్లాలో కొబ్బరి చెట్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 100కుపైగా కొబ్బరి చెట్లు కూలిపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి పంటలకూ నష్టం వాటిల్లింది. కూరగాయల పంటలు నీట మునిగాయి. నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంది.

తాళ్లరేవు పునరావాస కేంద్రంలో నిర్వాసితులు

కూలిన ఇళ్లు, విద్యుత్ స్తంభాలు, సెల్‌టవర్లు

మామిడికుదురులో నేలకొరిగిన కొబ్బరి చెట్టు

తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో ఇళ్లు కూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. కొన్ని చోట్ల సెల్‌టవర్లకూ నష్టం వాటిల్లింది. కాకినాడ జిల్లాలో 53 ఇళ్లకు నష్టం వాటిల్లింది. సుమారు 9.62 లక్షలకు నష్టం వాటిల్లింది. ఒక బోటు ధ్వంసం అయ్యింది. సుమారు రూ.20వేల నష్టం వాటిల్లింది. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, కిర్లంపూడిలో కాలువల గట్లకు, వంతెనలకు రూ.51.30 లక్షల మేర నష్టం వాటిల్లనట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 33/11 కెవి ఫీడర్లు 52, 11 కెవి ఫీడర్లు 214, 33/11 కెవి సబ్‌స్టేషన్లు 38, మరో 181 విద్యుత్ స్తంభాలు, 11 కెవి కండక్టర్‌కు నష్టం వాటిల్లింది. తూర్పు గోదావరి జిల్లాలో 76 కచ్చా గృహాలు శిథిలమైనట్టు గుర్తించారు. వీటిలో ఏడు గృహాలకు నష్టం వాటిల్లింది. ఒక నివాస గృహం పూర్తిగా శిథిలమైంది. 13 విద్యుత్ స్తంభాలకు నష్టం వాటిల్లింది. వీటిని సిబ్బంది సరిచేశారు. 21 వృక్షాలు నేలకొరిగాయి.

గోకవరంలో నేల వాలిన వరి పంట

నేల కొరిగిన వరి పంట

మొంథా తుపాన్ ప్రభావంతో వర్షం, ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో వరి పంట నేలకొరిగింది. పంట చేతికొచ్చే దశలో పంట నాశనం కావడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లపూడి మండలంలోని పెద్దేవం, గజ్జరం తదితర గ్రామాల్లో కోత దశకు వచ్చిన పంట నేలకొరిగింది. సుమారు 250 నుంచి 350 ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. **గోకవరం** మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 70 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని మండల వ్యవసాయ అధికారి రాజేశ్వరి తెలిపారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని సూచించారు. **సీతానగరం** మండలంలోని సుమారు 130 ఎకరాల్లో వరి పంట పూర్తిగా నేలకొరిగింది. రఘుదేవపురం, చినకొండేపూడి, సింగవరం, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక గ్రామాల్లోని వరిపొలాలపై తుపాను ప్రభావం అధికంగా ఉంది. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ నేపథ్యంలో కోరుకొండ వ్యవసాయ శాఖ ఎడి శశిబిందు, మండల వ్యవసాయ అధికారి గౌరీదేవి, ఎఇఒ గురుప్రియ క్షేత్రస్థాయిలో పర్యటించారు. దెబ్బతిన్న పంట పొలాలను స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు.

కార్టూన్ 'నిజం'



అప్రమత్తతతో 'మొంథా'ను ఎదుర్కొందాం : మంత్రి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ముంచుకొచ్చిన మొంథా తుపాన్‌ను అధికారులు, ప్రజలు అప్రమత్తతగా ఉండి ఎదుర్కొందామని పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అత్యవసర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రితో పాటు, జిల్లా ప్రత్యేక అధికారి కె. కన్నబాబు, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్‌పి డి.నరసింహకిషోర్, జెసి వై.మేఘా స్వరూప్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'విపత్తు ముందు, విపత్తు తర్వాత అధికారులు పూర్తిస్థాయి సన్నద్ధతతో ఉండాలి. రహదారులపై గండ్లు పడటం, చెట్లు కూలడం, ముంపు ప్రాంతాలు వంటి సమస్యలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో ఏమీ జరగదు' అనే నిర్లక్ష్య భావం ఉండకూడదు. స్థానిక యువత, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకోవాలి' అని అన్నారు. ప్రత్యేక అధికారి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

కె.కన్నబాబు మాట్లాడుతూ 'ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువలలో నీటి ప్రవాహ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైతే రిజర్వాయర్ల దిగువకు నియంత్రితంగా నీటిని విడుదల చేయాలి. రహదారులపై గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలి. వానరబుల్ ఏరియాస్ గుర్తించి, అక్కడ ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు సిద్ధం చేయాలి. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా అన్ని విభాగాల సమాచారాన్ని సమీకరించి విపత్తు నిర్వహణ యంత్రాంగం అందుబాటులో ఉంచాలి' అని ఆదేశించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 'తుపాన్ తీరం దాటే సమయంపై ఖచ్చితమైన సమాచారం కోసం వాతావరణ శాఖ సూచనలను ప్రతి నిమిషం అనుసరించాలి. ఏ సమయంలోనైనా ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ప్రభుత్వ శాఖల వారీగా చర్యలు అమలు చేయాలి' అని అన్నారు. రక్షణ చర్యలన్నీ డాక్యుమెంటేషన్ రూపంలో నిర్వహించాలని, పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌పి డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు పహారా విధులు కట్టుదిట్టం చేశామన్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఫైర్, పోలీస్ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒలు రాణి సుస్మిత, ఆర్.కృష్ణనాయక్, డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కొవ్వూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తలారి వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెద్దేవంలో నేలవారిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత దశలో ఉన్న సమయంలో తుపాను రైతులను నాశనం చేసిందన్నారు. తుపాను తీరం దాటిన తర్వాత కురిసే భారీ వర్షాలతో రైతులు మరింతగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రభుత్వం రైతులను నష్ట పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలిస్తున్న తలారి వెంకట్రావు

నర్సరీ రైతులకు అసోసియేషన్ సేవలు

ప్రజాశక్తి - కడియం

తుపాను ప్రభావంతో ఇబ్బందులను ఎదుర్కొనే రైతులకు నర్సరీ అసోసియేషన్ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉందని అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప తెలిపారు. మంగళవారం దామిరెడ్డి పల్లి నుంచి దుళ్ల వెళ్లే మార్గంలో కూలిన చెట్టును తక్షణం జెసిబి సాయంతో నర్సరీ అసోసియేషన్ తొలగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మూడు రోజులు పాటు మూడు జెసిబిలు అసోసియేషన్ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎక్కడైనా చెట్లు కూలినా, నర్సరీల్లో నీరు నిల్వ ఉండిపోయినా అసోసియేషన్‌కు సమాచారం ఇవ్వాలని అన్నారు.

కూలిన చెట్టును జెసిబితో తొలగింపు

పునరావాస కేంద్రాల పరిశీలన

మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల నుంచి తరలించిన పునరావస కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకార్యాలపై ఆరా తీవారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ రూరల్ మండలం నామవరం డి-బ్లాక్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం పరిశీలించారు. కేంద్రంలో తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సదుపాయాలు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అదికారులను ఆదేశించారు. **రాజమహేంద్రవరం సిటి** స్థానిక చందా సత్రంలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని నగర కమిషనర్ రాహుల్‌మీనా సందర్శించారు. లంక గ్రామాల నుంచి వచ్చిన బాధితులను ఆయన పరామర్శించి సదుపాయాలపై ఆరా తీశారు. బాధితులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. **తాళ్లపూడి** మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. అన్నదేవరపేటలో మెడికల్ క్యాంపును, గజ్జరంలో కొత్త చెరువు గట్టు కోతకు గురికాకుండా ఏర్పాటుచేసిన ఇసుక బస్తాలను పరిశీలించారు. **పెరవలి** మండలంలోని కానూరు, పెరవలి గ్రామాల్లో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాలను మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. భోజనం, వైద్యం, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. బాధితులకు ధైర్యం చెప్పారు. వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన మందులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. తహశీల్దార్ కె.నిరంజన్, సర్పంచ్ సర్పంచ్ భావన మధుపూర్ణచంద్, నాయకులు రాంబాబు, విఆర్ఒ సొంగా రాజు, సిబ్బంది పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** ఉండ్రాజవరం- తాడిపర్రు రోడ్డులోని ఆర్‌కె నగర్‌లో 20 ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ఆయా కుటుంబాలను పునరావస కేంద్రానికి తరలించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పూరి గుడెసెల్లో నివాసం ఉంటున్న ప్రజలను ఆయా కేంద్రాలకు తరలించారు. పునరావస కేంద్రాల వద్ద విద్యుత్, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ మడిపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పునరావస కేంద్రాన్ని మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఆహారం, భద్రత కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. **కడియం** స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రానికి సుమారు 180 మందిని తరలించినట్లు తహశీల్దార్ సునీల్‌కుమార్,



ఉండ్రాజవరంలో బాధితులను పరామర్శిస్తున్న మంత్రి కందుల

ఎంపిడిఒ కె.రమేష్ తెలిపారు. భోజనం, వసతి సౌకర్యాలు, పాలు, బిస్కెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. **కొవ్వూరు** మండలంలోని కొవ్వూరు, మద్దూరులోని పునరావాస కేంద్రాలను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. కొవ్వూరు పునరావాస కేంద్రంలో బాధితులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను ఎంఎల్ఎ దగ్గరుండి తొలగింపు చర్యలను పర్యవేక్షించారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ రాణి సుస్మిత, తహశీల్దార్ దుర్గాప్రసాద్, జిల్లా ప్రత్యేక అధికారి ఎస్.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. **నల్లజర్ల** మండలంలోని దూబచర్లలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు పరిశీలించారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ రాణి సుస్మిత పాల్గొన్నారు.

జేగురుపాడులో రియల్ టైమ్ వాయిస్ అలర్ట్

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడు పంచాయతీ కార్యాలయ భవనంపై జాతీయ విపత్తుల శాఖ ఆధ్వర్యంలో రియల్ టైమ్ వాయిస్ అలర్ట్ సౌండ్ సిస్టమ్‌ని ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రప్రథమంగా జేగురుపాడులో ఈ సిస్టమ్‌ని ఏర్పారు చేశారు. జాతీయ విపత్తులకు సంబంధించిన హెచ్చరికలను ప్రజలకు ఎప్పటికప్పుడు ఈ సిస్టం ద్వారా చేరవేయనున్నారు. 360 డిగ్రీల హారన్స్‌తో స్పీకర్స్ కిలోమీటర్ పరిధిలో ఎప్పటికప్పుడు వాతావరణంలో జరిగే మార్పులను వాయిస్, సైరన్స్ రూపంలో హెచ్చరికలను జారీ చేయనుంది. విద్యుత్ సరఫరా లేకున్నా ఈ సిస్టం యథావిధిగా పని చేస్తుంది. ప్రస్తుతం మొంథా తుపాను విపత్తు నేపథ్యంలో గ్రామస్థులకు గంట గంటకు వాతావరణంలో మార్పులను వాయిస్ రూపంలో ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందని సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ తెలిపారు.

జెగురుపాడు పంచాయతీపై వాయిస్ అలర్ట్

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మొంథా తుపాను కారణంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకు బుధవారం సెలవు ప్రకటించినట్లు డిఇఒ వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు గమనించాలన్నారు. ఎవరైనా స్టడీ క్లాసులు, అదనపు తరగతుల పేరుతో విద్యా సంస్థలను తెరిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ సమస్య లేకుండా చర్యలు

ప్రజాశక్తి - చాగల్లు

మొంథా తుపాన్ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు. విద్యుత్ స్తంభాల దిగువన ఉన్న చెట్లను తొలగిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి త్రిమూర్తులు తెలిపారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

మొంథా తుపాన్ ప్రభావంతో బొమ్మూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.సన్యాసిరావు ఆధ్వర్యంలో ఎఇ కెఎస్ఎన్.ప్రసాద్, ఎల్ఐ పి.కృష్ణారెడ్డి ఆ ప్రాంతానికి చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏదైనా సమస్య ఏర్పడితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని మార్కొండపాడు గ్రామంలో తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలికి చెట్టు విరగడంతో విద్యుత్ స్తంభం నేలకు ఒరిగిపోయింది. దీంతో విద్యుత్, పంచాయతీ సిబ్బంది వెంటనే రోడ్డుపై చెట్టును, విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. దాని స్థానంలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

ఉద్యాన పంటల పరిశీలన

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని రంప ఎర్రంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో ఉన్న ఉద్యానవన పంటలను ఉద్యానవన శాఖ అధికారి పి.రిని పరిశీలించారు. మామిడి, జీడి మామిడి, ఆయిల్ ఫామ్ తోటలు ఈదురు గాలుల వల్ల దెబ్బతినే అవకాశం ఉందని, పంట నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ప్రస్తుతానికి ఎటువంటి నష్టం వాటిల్లలేదని రిని తెలిపారు.

రాజమహేంద్రవరంలో భిన్న వాతావరణం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

మొంథా తుపాన్ ప్రభావంతో రాజమహేంద్రవరంలో భిన్న వాతావరణం నెలకుంది. గంట గంటకూ వాతావరణంలో మార్పులు కన్పించాయి. పది నిమిషాల పాటు వర్షం, మరో 10 నిమిషాలు ఎండ, ఈదురుగాలులు వంటి వాతావరణం చోటుచేసుకుంది. వ్యాపార సంస్థలు అక్కడక్కడ మాత్రమే తెరిచారు. కంబాల చెరువు నుంచి లాలాచెరువు సెంటర్, ఎవి.అప్పారావు రోడ్డు, కోరుకొండ రోడ్డు, కంబాల చెరువు, శ్యామలా సెంటర్, మెయిన్ రోడ్డు ప్రాంతాలలోని తోపుడు పండ్ల వ్యాపారులు తమ వ్యాపారలను పూర్తిగా మూసివేశారు.

రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల కొండాలమ్మ గుడి సమీపంలో 216 ఎ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో వలస కూలీ మృతి చెందింది. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం..ఒడిశా రాష్ట్రం కోరపుట్టు జిల్లాలో అంపబలిలోని దొండగూడకు చెందిన వలస కూలీ కె.రమ(40) మండలంలోని చొప్పెల్ల ఇటుక బట్టీలలో తన భర్త సుధ తో కలిసి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి జాతీయ రహదారి పైకి బహిర్భూమికి వెళ్లేందుకు వచ్చిందన్నారు. ఇంతలో గుర్తు తెలియని వాహనం రమను ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర గాయాలతో రమ అక్కడికక్కడే మృతి చెందింది. మృతిరాలి భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. అలాగే మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించారు.

ప్రమాదకర చెట్ల తొలగింపు

ప్రజాశక్తి - యానాం

మొంథా తుఫాన్ ప్రభావంతో వీస్తున్న ఈదురు గాలుల నేపథ్యంలో ప్రజలకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. నియోజకవర్గ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను జెసిబిల సహాయంతో మున్సిపల్ సిబ్బంది మంగళవారం ఉదయం నుంచి తొలగింపు చర్యలు చేపట్టారు.

యానాంలో నేలకొరిగిన భారీ వృక్షాలు

మొంథా తుఫాన్ దుసుకొస్తున్న నేపథ్యంలో భారీ ఈదురు గాలులకు యానాంలో పలు భారీ వక్షాలు నేలకొరిగాయి. ఎన్డిఆర్ అఫ్ బృందం, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపాలిటీ తదితర శాఖల అధికారులు ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన వాటిని తొలగిస్తున్నారు. స్థానిక అతిథి గృహం వద్ద భారీ మామిడి చెట్టు నేలకొరిగింది. త్యాగరాయ వీధిలో పాత కోర్టు వద్ద కొండమల్లి చెట్టు, భీమ్ నగర్‌లో భారీ మామిడి చెట్టు, కనకాల పేటలో కొబ్బరి చెట్టు కరెంటు తీగలపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన వాటిని తొలగించి విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు ప్రయత్నాలు చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నావలను భద్రపరుస్తున్న మత్స్యకారులు

యానాం గౌతమి గోదావరి నదిలో అలలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో మత్స్యకారులు తమ నావలను ఒడ్డుకు చేర్చుకుని భద్రపరుస్తున్నారు. అదేవిధంగా బీచ్‌కి పర్యాటకులకు రాకుండా పోలీసులు గస్తీకాసారు.

పావనమూర్తి మరణం తీరని లోటు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తొలితరం అంబేద్కరీయుడు అంబేద్కర్ మిషన్ వ్యవస్థాపకులు, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎపి శాఖ తొలి అధ్యక్షుడు చింతకాయల పావనమూర్తి మరణం తీరని లోటని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యడ్ల కుటుంబరావు అన్నారు. యానాం పట్టణానికి చెందిన పావనమూర్తి ఉద్యోగ రీత్యా విశాఖపట్టణంలో స్థిరపడడంతో పాటు విశాఖ కేంద్రంగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, బౌద్ధ సమావేశాలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

బహిరంగ వేలం వాయిదా

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారికి యాత్రికులు సమర్పించే మేకలు, కోళ్లు తీసుకునేందుకు 5 నెలల కాల పరిమితి హక్కుకు సంబంధించి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటకు ఎవరూ హాజరు కాకపోవటంతో వేలం వాయిదా వేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఈ వేలం పాట ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత తెలియజేస్తామన్నారు.

యాత్రికులు మెచ్చేలా పరిశుభ్రత

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానానికి వచ్చే యాత్రికులు మెచ్చుకునేలా పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని దేవస్థానం ఇఒ వి.సుబ్బారావు ఆదేశించారు. మంగళవారం కొండపైన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శానిటేషన్ విభాగంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇఒ మాట్లాడుతూ దేవస్థానంలో మిగతా రోజులు కన్నా ఈ మాసంలో శానిటేషన్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అందుకు అనుగుణంగా ఆయా ప్రదేశాల వద్ద విధులు నిర్వహించే సూపర్వైజర్లు పారిశుధ్య కార్మికులతో పనులు చేయించి పరిశుభ్రత కనబడే విధంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. వసతి గదుల సత్రాలు ప్లాట్ ఫామ్‌లు వ్రత మండపాలు మెట్ల మార్గంలోనూ శానిటేషన్ బాగోలేదని ఫిర్యాదులు వస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూకరత్నం, మాన్ పవర్ ఏజెన్సీ మేనేజర్లు సతీష్ గోవిందు పాల్గొన్నారు.

కాలువను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ఏలేరు కాలువను పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెద్దాపురం

కాండ్రకోటలోని ఏలేరు కాలువ పరీవాహక ప్రాంతాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని ఏలేరు దబ్బ కాలువలో నీటి ఉధృతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె.వెంకటలక్ష్మి, ఎస్ఐ వి.మౌనిక, ఎలిశెట్టి నాని, కొత్తెం వెంకట శ్రీనివాసరావు, మొయిళ్ల కృష్ణమూర్తి, టిడిపి నాయకులు, రైతులు, విఆర్ఒలు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎద్దాపురం మండల పరిధిలోని వడ్లమూరు-జీ రాగం పేట ఏలేరు వంతెన వద్ద ఏలేరు నీటి ఉధతిని మంగళవారం వ్యవసాయ అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి ఏలేరు నీటి ఉధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కే సంజయ్ కుమార్ రైతులకు. ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జలదాని సుబ్రహ్మణ్యం, నీటి సంఘం అధ్యక్షులు దేవళ్ల వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, కలెక్టర్

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు, కలెక్టర్ కీర్తి చేకూరి, జెసి వై. మెగా స్వరూప, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎస్‌డిసి కె.భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కంట్రోల్ రూమ్‌కు వస్తున్న కాల్స్, అందుతున్న సమాచారం పట్ల వెంటనే స్పందించి, సంబంధిత మండలాధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాత్ర కీలకమని తెలిపారు.

అత్యవసర సహాయ నంబర్లు

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 0883-2944455, ఆర్‌డిఒ కార్యాలయం నెంబర్లు 0883-2442344, 0883-2940695, రాజమహేంద్రవరం అర్బన్ 9849903860, రాజమహేంద్రవరం రూరల్ 6301523482, రాజానగరం 9494546001, రంగంపేట 9393931667, కోరుకొండ 9154474851, అనపర్తి 9441386920, బిక్కవోలు 9849903913, సీతానగరం 9177096888, గోకవరం 9491385060, కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయం 7995367797, కొవ్వూరు అర్బన్ 9866778416, చాగల్లు 9441293856, తాళ్లపూడి 7993636666, పెరవలి 08819-232179, ఉండ్రాజవరం 9491041474, నల్లజర్ల 9491041451, దేవరపల్లి 9705818045, గోపాలపురం 7569856778, నిడదవోలు 9440580856.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - సీతానగరం

బాధితులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బత్తుల

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ మంగళవారం పర్యటించారు. మండలంలోని ముగ్గళ్ళ గ్రామంలోని పలు ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ప్రజలందరూ తుపాను తీవ్రత దృష్ట్యా అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతేనే తప్ప బయటకు రావద్దని, అధికారులు ఇచ్చే సూచనలను తప్పక పాటించాలని కోరారు. అనంతరం పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ బాధితులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం వహించరాదని ఆదేశించారు. కష్ట సమయంలో ప్రజలకు అండగా ఉండాలని అధికారులను కోరారు. అనంతరం ఆయన రెవెన్యూ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టంపై తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ మండలానికి ప్రత్యేక అధికారిని నియమించామని, యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాథమికంగా సుమారు 132 ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్లు తెలిపారు. నష్టంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపి, రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సీతానగరం మండలం చీపురుపల్లిలో పూరిపాక కూలిపోయిందని, ఆ కుటుంబ సభ్యులను పునరావస కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. సింగవరంలో ఒక ఇంటి గోడ కూలిపోయిందని వివరించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ శ్రీనివాస్, సిఐ సత్యకిషోర్, ఎస్ఐ రామ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముందస్తు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - చాగల్లు, గోకవరం, తాళ్లపూడి

చాగల్లులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చాగల్లు మండలంలో తుపాన్‌ను ఎదుర్కొనేందుకు మండల అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని తహశీల్దార్ ఎం.మేరకమ్మ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 99 మంది పారిశుధ్య సిబ్బందిని సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రజారోగ్యం దృష్ట్యా 1692 కిలోల బ్లీచింగ్, 10,515 కిలోల సున్నం, సోడియం హైపో క్లోరైడ్ 200 లీటర్లు, ఫినాయిల్ 20 లీటర్లు, మలాధీన్ 22 లీటర్లు, క్లోరిన్ 15 లీటర్లు అందుబాటులో ఉంచమన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. గోకవరం మండంలో తుపాను పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గోకవరం మండల తహశీల్దార్ రామకృష్ణ కోరారు. భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలుల ప్రభావంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. విద్యుత్ తీగలు, చెట్లు, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు. అత్యవసర సమయాల్లో 8008803194, 9491385060 నెంబర్లను ప్రజలు సంప్రదించాలని కోరారు. అలాగే మంగళవారం రాత్రి ఏడు గంటల తరువాత ఎవ్వరూ బయటకు రాకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. 7 గంటల తరువాత రోడ్లపై వాహనాల రవాణ కాకుండా ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నివారించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వాహనాలకు అనుమతి ఇచ్చారు. తాళ్లపూడి మెయిన్ బజార్లో వ్యాపార సముదాయాలను ఎస్ఐ టి.రామకృష్ణ మూయించివేశారు అవసరమైతే తప్ప బయటకు రావద్దని పోలీసులు వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించారు.

ముందస్తు చర్యలపై దిశానిర్దేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటి

మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై నగర కమిషనర్ రాహుల్ మీనా దిశానిర్దేశం చేశారు. మంగళవారం అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రెండు, మూడు రోజుల్లో తుపాను పరిస్థితిని అంచనా వేసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ చిన్న సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా సహా అన్ని కీలక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకర హోర్డింగులను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కూలిన చెట్లను తొలగించడంతో పాటు అవసరమైన చోట చెట్ల కొమ్మలను కత్తిరించాలన్నారు. కంట్రోల్ రూమ్ (9494060060) నెంబర్ 24 గంటలూ పని చేయాలన్నారు. అలాగే పునరావాస కేంద్రాలలో తగిన ఆహారం, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఆయన సూచించారు.

మొంథా అలజడి

- -పలుచోట్ల విరిగిపడిన చెట్లు
- -విద్యుత్ సరఫరాకు ఆటంకం
- -పునరావాస కేంద్రాలకు పలువురు తరలింపు
- -గోదావరిలో నిలిచిన ఇసుక తవ్వకాలు
- -పంటల నష్టంతో అన్నదాతల ఆందోళన

ప్రజాశక్తి - కొవ్వూరు

అనుకున్న విధంగానే మొంథా తుపాను జిల్లాలో అల్లకల్లోలం సృష్టించింది. జిల్లా వ్యాప్తంగా 361 కుటుంబాలకు చెందిన 1193 మందిని పునరవాస కేంద్రాలకు అధికారులు తరలించారు. లోతట్టు ప్రాంతంలో ఉండే వాళ్లతో పాటు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారిని, తాటాకు పాకల్లో ఉంటున్న వారిని ముందస్తు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించారు. కొవ్వూరు 9, రాజమహేంద్రవరంలో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పా టు చేశారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న మండలాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ పునరుద్ధణ జిల్లా వ్యాప్తంగా 1200 మంది అదనపు సిబ్బందిని నియమించారు. 12 క్రేన్లతో పాటు 1500 స్తంభాలను అందుబాటులో ఉంచినట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ తిలక్‌కుమార్ తెలిపారు.

కొవ్వూరు డివిజన్ పరిధిలో మొత్తం 8 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మద్దూరు, కొవ్వూరు, నల్లజర్ల, దూబచెర్ల, ఖండవల్లి, పెరవలి, నిడదవోలు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తాత్కాలిక శిబిరాలుగా మార్చి అవసరమైన సౌకర్యాలను సమకూర్చారు. ఈ కేంద్రాల్లో 264 కుటుంబాలకు చెందిన 912 మంది ప్రజలు ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నట్లు ఆర్‌డిఒ రాణి సుస్మిత తెలిపారు తహశీల్దార్లు, మండలాధికారులు వ్యక్తిగతంగా శిబిరాలను పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు.

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని కాతేరు, హుకుంపేట ప్రాంతాల్లో 3 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో 97 కుటుంబాలకు చెందిన 281 మంది ప్రజలు తాత్కాలిక నివాసం పొందుతున్నారు. విద్యుత్, పరిశుభ్రత, వైద్య సేవలు, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలను నిరంతరంగా నిర్వహించేలా కృషి చేసినట్లు అధికారులు ప్రకటించారు.

గాలి తీవ్రతపై ముందస్తు సమాచారం

మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 272 రెవెన్యూ గ్రామాల వారీగా 28, 29 తేదీల్లో నమోదు అయ్యే వర్షపాతం, గాలి తీవ్రత వివరాలను మండల స్థాయి అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చారు. గ్రామ స్థాయిలో తగిన ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణన లోకి తీసుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కొవ్వూరులో కూలిన చెట్లు

చెట్టును తొలగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

మొంథా తుపానుతో కొవ్వూరు టౌన్‌లో మున్సి పల్ కార్యాలయం దగ్గర ఆటోపై చెట్టు విరిగి పడింది. ఆర్‌టిసి గ్యారేజ్ వెనుక వీధిలో చెట్టు తిరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో స్తంభం కూలిపోయింది. మున్సి పల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది దగ్గరుండి చెట్టు తొలగింపు చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన కూలిన స్థంభం స్థానంలో మరొక స్తంభం ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో సుమారు రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అవంతి ఫ్యాక్టరీ సమీపంలోనూ ఔరంగాబాద్ లోనూ రెండు చెట్లు కూలిపోయాయి. అవంతి సమీపంలో విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నిలిచిన ఇసుక తవ్వకాలు

తుపాను ప్రభావంతో గోదావరి నదిలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. గాలుల తీవ్రత భారీగా పెరగడంతో పడవలను పూర్తిగా నిలిపివేశారు. గాలుల ప్రభావానికి నదిలో అలలు ఎగిసిపడుతున్నాయి. బుధవారం కూడా ఇసుక తవ్వకాలు కొనసాగే పరిస్థితి పరిస్థితి లేదు.

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సర్పంచ్, ఇతరులు

నూతన ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - నల్లజర్ల

నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణ్‌రావు ఘనంగా సత్కరించారు. మంగళవారం పోతవరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జాలపర్తి జయశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పెన్నాడ శ్రీనివాసరావు, కొడమంచిలి శ్రీధర్, గడ్డం ప్రేమ్‌కుమార్, దొండపాటి హర్షప్రియలను శాలువాలు వేసి పూలమాలలతో సత్కరించారు. వీరితోపాటు, గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులు మిర్యాల రాంబాబు, విజయ్‌శ్రీనివాస్, వెంకటేష్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు రవికుమార్, తానింకి ప్రవీణ్‌కుమార్, చిడిపి చింతయ్య, సుధీర్, కలిదిండి శ్రీను, వెంకటరావు, దొండపాటి రాజు, ఉండ్రాజవరపు రాజు. కంకట నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఉధృతంగా తాండవ ప్రవాహం

ప్రజాశక్తి - కోటనందూరు

తుపాను ప్రభావంతో తాండవ రిజర్వేరులో నుంచి నీరు విడుదల చేయడంతో తాండవ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తాండవ పరీవాహక ప్రాంతాల్లో సాగు చేస్తున్న రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కోటనందూరు సమీపంలో ఉన్న తాండవ రిజర్వాయర్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుని పట్ట ణంలో ప్రధాన రహదారిలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. మున్సి పాలిటీ అధికారులు, నాయకులు వెంటనే స్పందించి చెట్లను తొలగిం చారు. నాయకులు యనమల రాజేష్, చింతమనేని అబ్బాయి, చైర్మన్ నార్ల భవన సుందరి, కమిషర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన

ప్రజాశక్తి - కాకినాడ

తుపాన పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలూ కల్పిస్తున్నామని సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు తెలిపారు. వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉందని, పరిస్థితిని అధికారులతో కలిసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఆమన్ జైన్, అరదాడి శివ, అంగాడి దుర్గారావు, ఎరిపిల్లి రాము, తెప్పల రామలింగేశ్వరరావు, గొరుసు దుర్గారావు, పూర్ణచంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంధకారంలో యానాం...

ప్రజాశక్తి - యానాం

మొంథా తుపాను ప్రభావంతో భారీ వృక్షాలు, చెట్లు కరెంటు తీగలపై పడి వైర్లు తెగిపోవడంతో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ సందర్భంగా యానాం ప్రాంతమంతా అంధకారంలో ఉంది. మంగళవారం ఉదయం నుంచి కరెంటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఎడతెరిపి లేని వర్షం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలవ్యాప్తంగా ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సుద్దగడ్డ, గొర్రెకండి కాలువలకు ఉధతి పెరిగింది. పట్టణంలో ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో పునరావాస కేంద్రం వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి అంగన్వాడీలు, గర్భిణుల గృహాలను సందర్శించి ఆరోగ్య సూచనలు చేశారు. సుద్దగడ్డ వాగు ఉధతి ఎక్కువైతే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తహశీల్దారు రామ్ కుమార్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎంపిడిఒ సెలెట్ రాజు, ఎఇ కృష్ణ, వైద్యులు డాక్టర్ కీర్తన ఉన్నారు.

తీర ప్రాంతాల్లో ప్రజాప్రతినిధుల పర్యటన

ప్రజాశక్తి - యానాం

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గొల్లపల్లి

మొంథా తుఫాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో గోదావరి నది తీర ప్రాంతాలైన సావిత్రి నగర్, గిరియంపేట, దరియాలతిప్ప, ఫరంపేట అగ్రహారం తదితర ప్రాంతాల్లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ అంకిత్‌కుమార్ సుడిగాలి పర్యటనలు చేశారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆర్ఎఒ అంకిత్‌కుమార్‌తో కలిసి పునరావస కేంద్రాలను పరిశీలించారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆర్ఎఒను కోరారు. తుపానును ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఎంఎల్ఎ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్ఎఒ అంకిత్‌కుమార్ మాట్లాడుతూ అత్యవసర పనుల కోసం జెసిబిలు, చెట్లను నరికేందుకు యంత్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రాలు, జిప్మర్ ఆసుపత్రి, డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ప్రమాదాల్లో ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. లిక్కర్ షాపులు, ఇతర దుకాణాలు మంగళవారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. మల్లాడి కృష్ణారావు పలు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు తుపాను తీవ్రతను ఎప్పటికప్పుడు పుదుచ్చేరి సిఎం రంగస్వామికి ఫోన్లో వివరించారు.

పురాతన శిథిల భవనం కూల్చివేత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట గడియార స్తంభం సెంటర్ ఎదురుగా సివిల్ స్థితిలో ఉన్న పురాతన భవనాన్ని తుపాను నేపథ్యంలో మంగళవారం జెసిబి సాయంతో కూల్చివేశారు. భారీ ఈదురుగాలులకు భవనం కూలి ప్రమాదం సంభవించనున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జెసిబి సహాయంతో తొలగించే పని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION, RAJAMAHENDRAVARAM
ENGINEERING SECTION

REQUEST FOR PROPOSAL — **Dated: 24-10-2025**

Request for Proposal are invited for the following works from the eligible contractors only.

Sl.No.	RFP / NIT No.	Name of the work
1	33/MCR/RFP/ 2025-26	Design Development and Beautification of Various Parks & Open Spaces in Rajamahendravaram City (Package-2) 5th Call
2	262/MCR/RFP/ 2025-26	Design Development and Beautification of Various Parks & Open Spaces in Rajamahendravaram City (Package-4)

RFP can be downloaded from e-procurement web site www.apeprocurement.gov.in in Service Sector from **Dt.24-10-2025 at 10.00 P.M** on wards. Last date of time of receipt of RFP on or before **Dt.10-11-2025 upto 2.30 P.M**

Sd/- **RAHUL MEENA**, IAS,
Commissioner
Municipal Corporation, Rajamahendravaram

పాస్‌పోర్టు పోయినది

సయ్యద్ మదీన బాషా, S/o. మీర, డోర్ నెం. 50-8-26, నెహ్రూ నగర్, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు **ది. 15-12-2015వ తేదీన N5374204** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసియున్నారు. సదరు పాస్‌పోర్టు **ది. 20-10-2025వ తేదీన** నేను ఇల్లు మారుతుండగా రాజమండ్రి నెహ్రూనగర్ సెంటర్ నందు పడిపోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

సయ్యద్ మదీన బాషా
సెల్: 9908633775

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో అమలాపురం
I.A 996/2024, in
FDP 1306/2018, O.S.12/2012

Between:-
కముజు నాగవెంకట సత్యప్రసాద్ ...పిటీషనరు/వాది
మరియు
1. లంకే వీర్రాజు (డైడ్)
R2. లంకే నాగబాబు S/o. Late లంకే వీర్రాజు, వయసు 28సం॥లు, హిందూ, డోర్‌నెం.3-189, కాట్రేనికోన విలేజ్, కాట్రేనికోన మండలం, డా॥బి.ఆర్.ఎ.కోనసీమజిల్లా.ఎ.పి
R3. నామాడి విజయలక్ష్మి W/o. వెంకటేష్, D/o Late లంకే వీర్రాజు, వయసు 26సం॥లు, హిందూ, వేట్లపాలెం విలేజ్, కాట్రేనికోన మండలం, డా॥బి.ఆర్.ఎ. కోనసీమజిల్లా.ఎ.పి ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై నెంబరు గ్రంథములో రెస్పాండెంట్లు అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా నోటీసులు పంపగా మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తము **ది.7-11-2025** తేదికి వాయిదా వేసినారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30 ని॥లకు** స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
కాండ్రేగుల వర ప్రసాద్
అమలాపురం — న్యాయవాది.
ది.28-10-2025 — సెల్.9393003681

మహారాజశ్రీ పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు
ARB EP No.293/2024 in AC 33/2023
Between:
M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సామర్లకోట బ్రాంచ్, Rep.by అటార్నీ హోల్డర్ Mr. లోకవరపు మల్లికార్జునరావు ....DHR
And
గోపు వీరభద్రరావు & అదర్స్ ....JDR's
1st JDR: గోపు వీరభద్రరావు, S/o. పాపారావు, డోర్ నెం.1-49/బి, రామాలయం దగ్గర, రూపులమ్మ గుడి వీధి, ఏలేశ్వరం, కాకినాడ జిల్లా
వాయిదా: ది.20-11-2025

ఈ నెంబరు E.P. బాకీ వసూలు నిమిత్తం 1st JDR అయిన మీకు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా **Or 21. R54** నోటీసు పంపించి చున్ననూ ఉద్దేశ్యపూర్వకంగా **Avoid** చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ నెంబరు **E.P.** లో **JDR** అయిన మీరు ది.**20-11-2025**న పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

తటవర్తి సత్యనారాయణ,
పెద్దాపురం — **అడ్వకేట్,** పెద్దాపురం
ది.28-10-2025 సెల్: 98856 57091

మహారాజశ్రీ పెద్దాపురం 7th అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు
Arbitration O.P. No.08/2025
Between:
M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అటార్నీ హోల్డర్ Mr. లోకవరపు మల్లికార్జునరావు ... పిటీషనర్
And
1. ఇంటి రాజ్యలక్ష్మి
2. ఎరికిరెడ్డి వెంకటేశ్వరరావు
3. ఇంటి రామకృష్ణ ... రెస్పాడెంట్స్
R1: ఇంటి రాజ్యలక్ష్మి, W/o.రామకృష్ణ, డోర్ నెం.4-24, రామాలయం వీధి, వేలంక గ్రామం, కిర్లంపూడి మండలం, కాకినాడ జిల్లా

పై నెంబరు పిటీషన్ ది.14-11-2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా అయి ఉన్నది. పై పిటీషన్ నందు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టున ది.**14-11-2025**వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి మీరు స్వయంగా గాని, మీ న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయ్యి మీ వాదనను తెలుపు కొనవలెను. లేని యడల మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్పునిచ్చెదరు.

//శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం//
M.K. మొహియుద్దీన్
పెద్దాపురం — **అడ్వకేట్,** పెద్దాపురం
ది.29-10-2025 సెల్: 95421 48566

In the Court of the Junior Civil Judge, Anaparthi
O.S. No. 34/2024

Between:
Canara Bank (Previously Syndicate Bak) Rep. by its Senior Branch Manager, Anaparthi Branch, Anaparthi ***...Plaintiff***
AND
M/s. Ramakrishna Industries, Biccavolu, Rep. by its Proprietor, Satti V.V.Siva Ramakrishna Reddy ***...Defendant***

To: ***Defendant:***
M/s. Ramakrishna Industries, Rep. by its Proprietor, Satti V.V.Siva Ramakrishna Reddy, S/o. Raghu Rama Reddy, Business, D.No. 1-223, Main Road, Mahendrawada Road, Polamuru - 533342, Boccavolu Mandal, E.G.District.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 07-11-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వేగుళ్ళ వెంకటరమణమూర్తి
అడ్వకేట్, గాంధీనగర్
కాకినాడ, సెల్: 9866033899